సేవలకు చిరునామా సచివాలయం

ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన


శృంగవృక్షం సచివాలయం వద్ద సేవలు పొందుతున్న ప్రజలు

పాలకోడేరు: గ్రామ స్వరాజ్యం. ఈ మాట పుస్తకాల్లో చదవడం, ప్రసంగాల్లో వినడం తప్ప వాస్తవిక పరిస్థితుల్లో ఎప్పుడూ చూడలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక గ్రామ, వార్డు సచివాలయాలతో ఇంటి ముంగిటకే పాలన వచ్చింది. తద్వారా అసలైన గ్రామ స్వరాజ్యాన్ని కళ్ల ముందే చూస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. సచివాలయాలంటే సేవలకు చిరునామాలుగా మారాయి. నియోజకవర్గంలోని ఉండి, పాలకోడేరు, ఆకివీడు, కాళ్ల మండలాల్లో 3 లక్షలకు పైగా జనాభాకు ఇళ్ల వద్ద నుంచి ప్రభుత్వానికి సంబంధించి అన్నీ సేవలు అందే వెసలుబాటు కలిగింది. ఆయా సచివాలయాల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 750మంది ఉద్యోగులు 1152 మంది వలంటీర్లు ప్రజలకు నిత్యం పథకాల పరంగా సేవలు అందిస్తూనే ఉన్నారు.

అందుతున్న సేవలెన్నో... స్థానికంగా 72 గ్రామాల్లో 75 సచివాలయాల పరిధిలో 1152 మంది వలంటీర్లు అందిస్తున్న సేవలు వర్ణనాతీతం. ప్రతి నెల 1న తెలవారుతుండగానే అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు ఇంటి తలుపులు తట్టి సామాజిక పింఛన్ సొమ్ము చేతిలో పెట్టడంతో ఆ లబ్ధిదారుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రతి నెల చౌక డిపోకు వెళ్లి వరుసలో నిలబడి రేషన్ సరుకులు తీసుకునే అసౌకర్యానికి చరమగీతం పాడి ఇంటి వద్దకే రేషన్ బండి వచ్చేలా వలంటీర్లు పర్యవేక్షిస్తున్నారు. సచివాలయాల ద్వారా నవరత్నాల పథకాలకు సంబంధించి పింఛన్ , అందరికి ఇళ్లు, జగనన్న చేదోడు, చేయూత, పెన్షన్ కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు రీసర్వే ఇలా చెప్పకుంటూ పోతే దాదాపు వందకు పైగా సేవలు అందుతున్నాయి.

గుమ్మం దాటకుండానే..



వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ వచ్చిన తర్వాత ప్రభుత్వ పాలన ఇంటి వద్దకే వచ్చింది. గతంలో ఏదైన ప్రభుత్వ పథకం లబ్ధిదారుడికి చేరేందుకు అనేక డబ్బులు పోసి తహసీల్దార్ కార్యాలయాలకు పదేపదే తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు లబ్ధిదారులు ఇంటి గుమ్మం దాటకుండానే సేవలు అందుతున్నాయి.

జామితి రెడ్డి పద్మ, వేంద్ర

సేవలు అభినందనీయం



ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హుల ఇళ్లకు వలంటీర్లు వచ్చి ఆధార్ కార్డు జిరాక్సు తీసుకొని వారే దరఖాస్తు చేయిస్తున్నారు. వారి ద్వారా అన్ని ప్రభుత్వ సేవలూ అందుబాటులో రావడంతో ఇబ్బందులు తప్పాయి. వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయం

చిగురుపాటి జయంతి, మోగల్లు

వ్యవస్థ బాగుంది



సచివాలయ వ్యవస్థ వచ్చాక అన్ని ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే వస్తున్నాయి. మా ఇంటికి ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారు జామునే వలంటీరు వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తోంది. సచివాలయాలు, వలంటీర్లు లేక ముందుకు ఏఅవసరం వచ్చినా తహసీల్దార్, విఆర్వో కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం సచివాలయాల వ్యవస్థ బాగుంది.

ఎం.సంపత, మోగల్లు

నేడు ఆకివీడులో గడప గడపకు మన ప్రభుత్వం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం-3లో 5వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగనుందని నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్ గురువారం చెప్పారు. కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్లు హాజరవుతారని తెలిపారు. సచివాలయ సిబ్బంది, నగర పంచాయతీ వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

పాలకొల్లు అర్బన్: దేశ పౌరులుగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు కోరారు. దేశ భవిష్యత్తు ఓటు అనే ఆయుధంపై ఆధాపడుతుందని ఆయన స్పష్టం చేశారు. మండలంలోని ఉల్లంపర్రు డాక్టర్ సబితా జూనియర్ కళాశాలలో గురువారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించినట్లు చెప్పారు. ఎంఈవో గుమ్మళ్ల వీరాస్వామి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎంఎస్ వాసు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలి


కేవీకేలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న డాక్టర్ ఎస్.భరతలక్ష్మి

ఉండి: వ్యవసాయం, అరటి సాగులో అంతర్ పంటలపై రైతులు ప్రత్యేక దృష్టి సారిస్తే అధిక లాభాలు సాధించవచ్చని డాక్టర్ ఎస్ భరతలక్ష్మీ అన్నారు.గురువారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రంలో అమె పర్యటించారు. ఈ సందర్భంగా కేవీకేలో విత్తనోత్పత్తి క్షేత్రం, సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పదర్శనాక్షేత్రం, ఉద్యానవన షేడ్‌నెట్ నర్సరీ, కొత్తగా ఏర్పాటు చేసిన వివిధ రకాల అరటి మొక్కల ప్రదర్శనాక్షేత్రాన్ని, వరి సాగును ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు లాభాలు రావాలని, మంచి విత్తనాలు వారికి అందించాలని కేవీకేల ద్వారా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు, డాక్టర్ ఎన్ దెబోరామెస్సియానా, డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ ఏ రాజేష్, బీ రజిత, బీ రామకృష్ణ తదితర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీల లెక్కింపు


పెద్దింటి అమ్మవారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆకివీడు: స్థానికంగా దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న దేవాలయాల్లోని హుండీలను గురువారం లెక్కించారు. స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం రూ. 1,32,282లు, వనువులమ్మ వారి హుండీ ఆదాయం రూ. 53,997లు, భీమేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 74,507లు, మదన గోపాల స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.8,679లు వచ్చినట్లు ఆలయ మేనేజర్ రంగరాజు చెప్పారు.

పేదల కోసం పనిచేసే పార్టీ వైఎస్సార్ సీపీ


మాట్లాడుతున్న పార్టీ వీరవాసరం మండల కన్వీనర్ గూడూరి ఓంకారం

వీరవాసరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని రాయకుదురులో గురువారం జరిగిన గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యాన అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపు అడుగులు వేస్తూ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారని వివరించారు. గృహసారథుల నుంచి బీమా దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, సర్పంచ్ గెద్దం భారతి, నాయకులు పాల్గొన్నారు.

జ్వర పీడితులను ఆదుకోవాలి

పెనుగొండ: తామరాడలో జ్వరాలను అరికట్టి, బాధితులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో పర్యటించిన ఆయన ప్రతి కుటుంబంలోనూ జ్వర పీడితులు ఉన్నారని తెలిపారు. బాధితులు పాలకొల్లు, పెనుగొండ, తణుకు ప్రయివేటు ఆసుపత్రుల్లో చేరి ప్రాణాలు రక్షించుకుంటున్నారన్నారు. పారిశుద్యం మెరుగుపర్చాలని కోరారు. ఆయన వెంట పార్టీ గ్రామ కార్యదర్శి మామిడిశెట్టి వెంకట్రావు ఉన్నారు.

బల్లిపాడులో చంద్రయాన్-3 విజయోత్సాహం

అత్తిలి: భారత అంతరిక్ష శాస్త్రవేత్తల అవిరళ కృషి, పట్టుదల, సాధించాలనే తపన ఫలితమే నేడు ప్రపంచం మనవైపు అబ్బురంగా చూస్తోందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. చంద్రునిపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా ల్యాండ్ అయిన సందర్భాన్ని పురస్కరించుకుని అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విజయోత్సవ వేడుక, శాస్త్రవేత్తలకు అభినందన సభ నిర్వహించారు. విద్యార్థులు ×జయహో ఇస్రో అనే అక్షర ఆకారంలో కూర్చుని శాస్త్రవేత్తలకు అభినందన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ మేరా భారత్ మహాన్ అని అందరూ గర్వంగా తలెత్తుకుని నడవాల్సిన సందర్భం ఇది అని అన్నారు. పీఈటీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


భీమవరం 7వ వార్డులో ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 7వ వార్డు గాంధీ నగర్(లెప్రసీ కాలనీ)లో రూ.85 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆనాడు పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక పక్క ఆరోగ్యశ్రీ పథకాన్ని అద్భుతంగా అమలు చేస్తూనే మరోపక్క వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. అందులో భాగంగానే ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునీకీకరించటంతో పాటు పట్టణాలు, గ్రామాల్లో వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం, వాటికి శాశ్వత భవనాలను కూడా నిర్మిస్తున్నారన్నారు. అందులో భాగంగా భీమవరం పట్టణానికి మూడు అర్బన్ పీహెచ్‌సీలను మంజూరు చేసి వాటికి భవనాలు కూడా నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్‌నర్స్‌లు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డీఈఓ, ఎల్‌జీఎస్, 8 మంది ఏఎన్ఎంలు, 9 మంది ఆశా వర్కర్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, డీపీఎంవో డాక్టర్ సుగుణరాజు, డాక్టర్ లీలాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, ఏఎస్ రాజు, చెల్లబోయిన సూర్యప్రకాష్, వాసర్ల ముత్యాలరావు, పాలపర్తి జోనా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


పెద అమిరం గ్రామంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పీవీఎల్

కాళ్ల: గ్రామంలోని ప్రజలకు సేవలు అందించడంతోపాటు నిరుపేద కుటుంబాలకు సహాయం చేయడం అభినందనీయమని డీసీసీబీ చైర్మన్ పీవీయల్ నరసింహారాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమీరం గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో పేదలకు ఏర్పాటు చేసిన దుప్పట్లు, చీరలు పంపిణీ కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని సుమారు 600 మంది పేదలకు దుప్పట్లు, చీరలు, లుంగీలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన పీవీఎల్ మాట్లాడుతూ సర్పంచ్ సోమేశ్వరరావు తన మనవడు కార్తికేయ పుట్టినరోజు సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి కోరా రామ్మూర్తి, పంచాయతీ బోర్డు సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ జాతరను ప్రారంభించిన ఎమ్మెల్యే గ్రంధి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని రెస్ట్ హౌస్ రోడ్డు శివారులో వెలసిన శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతరను గురువారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాలర్ల సంఘం సొసైటీ ఆధ్వర్యాన అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రతి ఏటా వైభవంగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందన్నారు.

పల్లెల అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం

- డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఆకివీడులోగడప గడపకు మన ప్రభుత్వం


ఆకివీడు 3వ వార్డులో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: ప్రజా సంక్షేమం, పల్లెల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగుతోందని ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహారాజు చెప్పారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 3వ సచివాలయంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు వీధుల్లో ఇంటింటా పర్యటించిన పీవీఎల్‌కు ప్రజలు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలతో తమకు మేలు జరుగుతుందన్నారు. డ్రెయినేజీ, మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాపునేస్తం నిలిచిపోయిన మహిళ తనకు కాపునేస్తం పునరుద్ధరించాలని కోరగా వెంటనే వలంటీర్‌తో మాట్లాడి వెంటనే దరఖాస్తు, ఆధార్ ఇతర వివరాల్ని అప్‌లోడ్‌చేయించాలని ఆదేశించారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ పథకాలు అమలులో గాని, అభివృద్ధి పనుల్లో గాని అవినీతి రహితంగా పరిపాలన కొనసాగుతోందని చెప్పారు. అవినీతికి తావులేకుండా అన్నీ ఆన్‌లైన్‌లో, వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు చేరుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నగర పంచాయతీ వైస్‌చైర్మన్‌లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, చీఫ్ విప్ పడాల శ్రీనివాస రెడ్డి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, పళ్ళెం అరుణకుమారి, కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, నిమ్మల నాగు, గేదల అప్పారావు, ఎండీ. జక్కీ, వార్డు ఇన్‌ఛార్జి రాజనాల పెద్దిరాజు, సర్పంచ్ చెలంకూరి చలపతిరావు, మెరుగ దీనమనస్సు, తహసీల్దార్ విజయలక్ష్మీ, నగర పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి కసరత్తు


ఆర్అండ్‌బీ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. వంతెనలకు ఇరువైపులా అక్రమణలు పెరిగిపోవడంతో డిజైన్ల ఖరారు విషయంలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ మేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో ఆర్అండ్‌బీ ఈఈ లోకేశ్వరరావు, డీఈ రామరాజు, కన్సల్టెంట్ రామకృష్ణ సమావేశమై డిజైన్ల ఖరారుపై చర్చించారు. ఇదిలా ఉంటే ఈ అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ముందుగా రూ.15.50 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. అయితే మరింత ఆధునిక డిజైన్లతో అప్రోచ్ రోడ్లను నిర్మించాలనే తలంపుతో ఎమ్మెల్యే శ్రీనివాస్ రూ.36 కోట్ల నిధులను మంజూరు చేయించారు. కానీ కన్సల్టెంట్ జాప్యంతో కొంతమేర అప్రోచ్ రోడ్ల నిర్మాణం ఆలస్యమైంది. అయితే ఎమ్మెల్యే గ్రంధి పట్టువదలకుండా డిజైన్ల ఖరారు కోసం శ్రమించడంతో ఇటీవలే ఆర్అండ్‌బీ సీఈ (డీఎం) ఎల్.శ్రీనివాస్ రెడ్డి స్వయంగా వంతెనలను పరిశీలించారు. వంతెనలకు ఇరువైపులా ఆక్రమణలను గుర్తించారు. ఈ నేపథ్యంలో డిజైన్ల కసరత్తును పూర్తి చేయడానికి స్థానికంగా ఉన్న ఆర్అండ్‌బీ ఈఈ, డీఈ, కన్సల్టెంట్ వినతి మేరకు మరోసారి ఎస్ఈ రెండు రోజుల పాటు వంతెనలను పరిశీలించనున్నారు. కాగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేసిన కృషి కారణంగా నాలుగైదు రోజుల్లోగా డిజైన్లు ఖరారు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే నిధులు మంజూరు అయ్యాయి కాబట్టి డిజైన్లు ఖరారైన వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తారని అధికారులు చెప్తున్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు


చంద్రయాన్- 3 విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

వీరవాసరం: చంద్రయాన్ 3 విజోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నవుడూరు జంక్షన్‌లో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. నవుడూరులో ఉన్న నేషనల్ ఫ్లాగ్ టవర్ నుంచి నౌడూరు జంక్షన్ వరకు విద్యార్థులంతా జాతీయ జెండాలను చేతభూని జయహో భారత్ అంటూ నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా నేషనల్ ఫ్లాగ్ టవర్ లో ఉన్న భరతమాత విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వడ్డీ సుబ్బారావు, పద్మాలయ రవి, కేఎస్ఎన్ఆర్ విద్యార్థులు ,పద్మాలయ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మన కీర్తి జాబిలంత పెరిగింది

ఆకివీడు: చంద్రయాన్-3 ఘన విజయంతో మన కీర్తి జాబిలంత పెరిగిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహారాజు చెప్పారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద చంద్రయాన్-3 విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, నగర పంచాయతీ వైస్‌చైర్మన్‌లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, మాజీ ఎంపీటీసీ అంబటిరమేష్, పడాల కిషోర్ రెడ్డి, గుండా సుందరరామనాయుడు, శిరపు శ్రీనివాస్, కేశిరెడ్డి దిలీప్, కౌన్సిలర్లు మోటుపల్లి రాజు, నిమ్మల నాగు, ఎండీ.జక్కీ, తిప్పా దుర్గా భవానీ, సర్పంచ్ చెలంకూరి చలపతిరావు, పలువురు నాయకులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవాలు

సాక్షి, భీమవరం: చంద్రయాన్-3 చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా అడుగుపెట్టిన సందర్భంగా గురువారం భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు చేట్టిన విజయోత్సవ ర్యాలీని ఆర్డీవో దాసి రాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండైన తొలి దేశంగా భారత్ రికార్డు సృష్టించిందన్నారు. చంద్రయాన్ రూపకల్పనలో పాల్గొన్న శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం


డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకారులు

ఆకివీడు: మత్స్యకారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు హెచ్చరించారు. స్థానిక మత్స్యకారుల సంక్షేమ సంఘంలో తమకు సభ్యత్వం కల్పించాలని కోరుతూ గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ సంఘంలో కొత్త సభ్యుల్ని ఎందుకు చేర్చుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. చనిపోయిన సభ్యుల స్థానంలో కొత్త వారికి స్థానం కల్పించాలన్నారు. సంఘంలో ఇప్పటి వరకూ ఒకే కుటుంబంకు చెందిన వ్యక్తులే సభ్యులుగా కొనసాగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సంఘ ఎన్నికలు నిర్వహించే మత్స్యకార శాఖ అధికారులు కొత్త సభ్యుల్ని చేర్చుకున్న తరువాతే ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. కొత్త సభ్యుల చేరిక లేకపోవడం వల్ల సంఘం ఏకపక్షంగా పనిచేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయని పీవీఎల్ అన్నారు. ఇటువంటి విధానాలకు స్వస్తి చెప్పి ప్రభుత్వం అందజేసే పథకాల్ని మత్స్యకారులందరికీ అందే విధంగా చూడాల్సిన బాధ్యత మత్స్యశాఖ అధికారులకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మత్స్యకార సమస్యలపై స్థానిక మత్స్యకారులు చింతా చిన్నా, కొల్లి దుర్గా ప్రసాద్, వెంకటేశ్వరరావు, పొన్నాల సత్యనారాయణ, కొల్లాటి రమేష్, కొల్లు మురళీ కృష్ణ తదితరులు పీవీఎల్‌కు వినతి పత్రం అందజేశారు.

క్షీరారామలింగేశ్వరుడిని దర్శించుకున్న అభిషేక్

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరుడ్ని గ్రూప్ 1 విజేత రావూరి అభిషేక్, కుటుంబ సభ్యులు దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, సభ్యులు ముంగండ అన్నవరం, యాళ్ల అబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవర (ప్రకాశంచౌక్): జిల్లాలో ఎలక్షన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటన తెలిపారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వర్తించటానికి 8 డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అభ్యర్థులు పశ్చిమగోదావరి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈనెల 27 ఆఖరు తేదీగా పేర్కొన్నారు. ఎంపికైన వారికి రెమ్యూనరేషన్‌గా నెలకు రూ.18,500 చెల్లించనున్నట్లు తెలిపారు. రాత పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, అభ్యర్థి వయస్సు 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు.